క్లుప్తంగా

సెలవు రోజుల్లోనూ పని చేయనున్న క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2023–24) గానూ ఆస్తి పన్నును ఏకమొత్తంగా ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపు సమాచారం కోసం ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు హెల్ప్ డెస్కులు పని చేస్తాయని ఆమె తెలియజేశారు. పన్ను చెల్లింపునకు వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలో అదనపు క్యాష్ కౌంటర్లు, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరురోడ్డులోని 106 సచివాలయం, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148 వార్డు సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని ఆమె పేర్కొన్నారు.

రేపు ప్రభుత్వ మహిళా కళాశాల వార్షికోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల 81వ వార్షికోత్సవాన్ని శనివారం సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తులసీ గ్రూప్ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు, విజయవాడ సంయుక్త రవాణా కమిషనర్ డాక్టర్ భువనగిరి శ్రీకృష్ణవేణి, సుప్రీంకోర్టు న్యాయవాది మన్నవ ఆర్‌కేఎం సోదేకర్ అతిథులుగా హాజరుకానున్నట్లు ఆమె పేర్కొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

గుంటూరు ఈస్ట్: విద్యార్థిని అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు. హిందూ కళాశాల డిగ్రీ విద్యార్థిని రెండు రోజుల కిందట కళాశాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లకుండా ఏటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతి ఆత్మహత్య

పట్నంబజారు: వివాహం చేసుకోవడం ఇష్టం లేక యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళదాస్‌నగర్‌కు చెందిన గోదా శ్రావణి (20) ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. ఈ మధ్య ఆమెకు వివాహం నిశ్చయమై తాంబూలాలు కూడా మార్చుకున్నారు. ఈ క్రమంలో వరుడు నచ్చలేదని పెద్దలకు కూడా శ్రావణి తెలిపింది. నిశ్చితార్థం జరిగిన క్రమంలో పెళ్లి ఆపడం కుదరదనడంతో మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం ఆమె నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి శాంతి కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెదకాకాని: రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ఆటోను పెదకాకాని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహన తనిఖీలు చేస్తుండగా రేషన్ బియ్యం లోడుతో వెళుతున్న ఆటోను గుర్తించారు. బియ్యంతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను విచారించగా ఎడ్లపాడుకు చెందిన కారసాల యలమంద ఆటోలో బియ్యం లోడు చేయించి పంపించాడని, ఆటోనగర్ చేరుకోగానే ఫోన్ చేస్తే దిగుమతి చేసుకునే వ్యక్తి అక్కడికి వస్తాడని చెప్పి పంపించినట్లు వివరించాడు. ఆటోలో 3,500 కిలోలు రేషన్ బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రేషన్ బియ్యం తరలిస్తున్న డ్రైవర్ షేక్ ఇస్మాయిల్, నిర్వాహకుడు కారసాల యలమందపై కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్‌బాబు తెలిపారు. బియ్యం ఆటోను అదుపులోకి తీసుకున్న ఎస్ఐ పాదర్తి కోటేశ్వరరావు, సిబ్బందిని ఆయన అభినందించారు.

పెరిగిన పోలేరమ్మ హుండీ ఆదాయం



కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరు శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల హుండీ ఆదాయాన్ని గురువారం దేవాలయ ప్రాంగణంలో తెనాలి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు దేవాలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రామినేని నాగవేణి, తిరుపతిరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ సురేష్‌బాబు మాట్లాడుతూ మూడు రోజుల దర్శనం టికెట్లు, చందాలు, లడ్డూ ప్రసాదాలు, హుండీల ద్వారా రూ.21,39,487 వచ్చినట్లు ఆయన తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది అమ్మ వారి ఆదాయం రూ.85,255 పెరిగినట్లు చెప్పారు. లెక్కింపులో ఆలయ అర్చకులు, గ్రామస్తులు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో శివాలయంలో ఉచిత దంత వైద్య శిబిరం

పెదకాకాని: కాకాని శివాలయం ప్రాంగణంలో గుంటూరు వారాహి డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఈ నెల 15,16 తేదీల్లో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. డాక్టర్ చదలవాడ చంద్రశేఖర్, డాక్టర్ యోగశ్రీ , డాక్టర్ దెభప్రభతా తదితరులు ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏసీ కోరారు.

కుక్కలకు సమ్మర్ ఎఫెక్ట్

- వేసవిలో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల హెచ్చరిక



జీజీహెచ్‌లోని కుక్కకాటు కేంద్రంలో వ్యాక్సిన్ చేస్తున్న నర్సు (ఫైల్)

గుంటూరు మెడికల్: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతూ ఉండటంతో కుక్కలు ఎండ వేడిమిని తట్టుకోలేక పిచ్చిపిచ్చిగా ప్రవరిస్తున్నాయి. కనిపించిన వారిపై దాడికి పాల్పడుతున్నాయి. నగరంలో గత నెల 17 మందిపై ఒకేరోజు కుక్కలు దాడి చేశాయి. వేసవి ఎండలకు, ఉక్కపోతలకు జంతువుల్లో కూడా ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. సమ్మర్ ఎఫెక్ట్ కుక్కల్లో ఎక్కువగా కనిపిస్తుందని, వేసవి తాపాన్ని తట్టుకోలేక కనిపించిన వారిని కరిచేందుకు ప్రయత్నిస్తాయని పేర్కొంటున్నారు. వాటి జోలికి వెళితే మరింత ఎగబడి తీవ్రంగా గాయం చేస్తాయని వివరిస్తున్నారు. కుక్కకాటును నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పిల్లలు ఆటలాడుకుంటూ కుక్కల వద్దకు వెళ్లినా, అవి దాడి చేసే ప్రమాదం ఉన్న దృష్ట్యా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

జిల్లాలో కుక్కకాటు మరణాలు

జిల్లాలోని కాకుమానులో ఆరేళ్ల చిన్నారి కౌసర్ 2016లో, 2017లో గుంటూరు రూరల్ మండలం అడవితక్కెళ్లపాడులో నాలుగేళ్ల ధూపాటి ప్రేమ్‌కుమార్ కుక్కల దాడిలో మృతి చెందారు. ఈ పిల్లల మరణాలపై జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, విమర్శలు సైతం వినిపించాయి. కుక్కకాటు ద్వారా సంభవించే రేబిస్ వ్యాధి 2011లో రాష్ట్రాన్ని వణికించివేసింది. దీంతో కుక్కలంటే ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. జిల్లాలో ప్రతి ఏడాది వేలల్లో కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. ప్రతి కుక్కలోనూ రేబిస్ వైరస్ ఉండదు. కాని అది ఉన్న కుక్క ఏదో తెలియదు. కాబట్టి ప్రతి కుక్కకాటును సీరియస్‌గానే పరిగణించాలి. పిచ్చికుక్క కరిచిన వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

ఎండలు పెరిగే కొలది కుక్కకాటు బాధితుల సంఖ్య నానాటికి పెరిగిపోతోంది. సకాలంలో ఇంజెక్షన్లు చేయించని పక్షంలో మరణాలు సంభవించే ప్రమాదం ఉంది. గుంటూరు జీజీహెచ్‌లో 2020లో 2696 మంది, 2021లో 5010 మంది, 2022లో 5,513 మంది చేయించుకున్నారు. అయితే, ఈ ఏడాది ప్రారంభంలోనే బాధితుల సంఖ్య ఎక్కువగా ఉంది. జనవరిలో 2,710 మంది, ఫిబ్రవరిలో 2,634 మంది, మార్చిలో 2,765 మంది కుక్కకాటు ఇంజెక్షన్లు చేయించుకోవడం గమనార్హం.

జాగ్రత్తలు తీసుకోవాలి



కుక్క కరిచిన వెంటనే గాయాన్ని చల్లటి నీటితో, సబ్బుతో కడగాలి. నీరు ధారగా పడే విధంగా చేయాలి. గాయంపై టింక్చర్ అయోడిన్ వేయాలి. కుట్లు వేయడం, ఆయింట్‌మెంట్ పూయడం, గాయాన్ని నిప్పుపెట్టి కాల్చడం, కోయడం వంటివి చేయకూడదు. కుక్క కరిచిన వెంటనే సాధ్యమైనంత మేరకు త్వరగా వైద్యుల్ని సంప్రదించి టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. పెంపుడు కుక్కలకు కూడా టీకాలు వేయించాలి.

– డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ, గుంటూరు జీజీహెచ్

రేబిస్ వ్యాధి లక్షణాలు



కుక్కకాటు అవగాహన పోస్టర్

- మనుషులు రేబిస్ వ్యాధికి గురైనప్పుడు దవడ, గొంతు కండరాలకు పక్షవాతం వస్తుంది.
- ఎంత దాహం వేసినా నీటిని తాగలేరు.
- ఎక్కువ సందర్భాలలో రోగి నీటిని చూసినా, నీటి శబ్దం విన్నా భయకంపితులవుతారు.
- ఈ లక్షణాన్ని హైడ్రోఫోబియా అని పిలుస్తారు. ఇలాంటి స్థితిలో మతిస్థిమితం కోల్పోయి ఊపిరి పీల్చుకోలేక మరణిస్తారు.

జీజీహెచ్‌లో ఉచితంగా వ్యాక్సిన్

గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో ప్రతి రోజూ సుమారు 50 మంది కుక్కకాటు వ్యాక్సిన్ చేయించుకుంటున్నారు. అవుట్ పేషెంట్ విభాగంలోని 14బీ నంబర్ గదిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉచితంగా ర్యాబీపూర్ వ్యాక్సిన్‌ను చేస్తున్నారు. అత్యవసర విభాగంలో అన్ని వేళలా అందుబాటులో ఉంటుంది. కుక్కకరిచిన రోజు, మూడో రోజు, ఏడవ రోజు, 28వ రోజు మొత్తం నాలుగు సార్లు ర్యాబీపూర్ ఇంజెక్షన్లు చేయించాలి.



జీజీహెచ్‌లో కుక్క కాటుకు వ్యాక్సిన్లు వేసే గది

బీపీ మండల్‌కు ఘన నివాళి



బీపీ మండల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, కేసన శంకరరావు

నెహ్రూనగర్: ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఎంతగానో కృషి చేసిన మహనీయుడు బీపీ మండల్ అని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. బీపీ మండల్ వర్ధంతిని పురస్కరించుకుని ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కుమ్మర క్రాంతికుమార్, నిమ్మల శేషయ్య, కోలా అశోక్ పాల్గొన్నారు.

బీపీ మండల్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో..

దేశవ్యాప్తంగా జరిగే కులగణనలో భాగంగా బీసీ జనగణన చేపట్టాలని బీపీ మండల్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ తోట కోటేశ్వరరావు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. బీపీ మండల్ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీనగర్‌లోని స్టడీ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్, వైకే, వాసు, వెంకటసాయి, సాంబశివరావు, జూపూడి శ్రీనివాసరావు, సుబ్బారావు, తాడికొండ నరసింహారావు పాల్గొన్నారు.

సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన



పట్నంబజారు: తూర్పు నియోజకవర్గంలోని 3వ డివిజన్ బాలాజీనగర్ 10వ లైనులో రూ.14లక్షల వ్యయంతో, యాదబజారులో రూ.11లక్షలతో చేపట్టనున్న సైడ్ డ్రెయిన్ల నిర్మాణాలకు డివిజన్ కార్పొరేటర్ పోలవరపు జ్యోతి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా నేత షేక్ నూరి ఫాతిమా గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు స్థానికుల ఇబ్బందులు సైడ్ డ్రెయిన్ నిర్మాణాలతో తొలగిపోనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేలు పోలవరపు వెంకటేశ్వరరావు, రాంబాబు, సాంబశివరావు, స్వర్ణలత, సుబ్బులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'రైతే రాజు' నాటిక



శ్రీనివాసరావును సత్కరిస్తున్న అతిథులు, సంస్థ నిర్వాహకులు

పాత గుంటూరు: కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్‌బ్ రీడింగ్ రూంలో వైష్ణవి ఫిలిమ్స్, కళా విపంచి, గుమ్మడి శ్రీమన్నారాయణ కళా సమితి, ఎన్‌టీఆర్ కళాపరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వై.కె. నాగేశ్వరరావు ద్వితీయ నాటకోత్సవాల్లో భాగంగా గురువారం 'రైతే రాజు' నాటిక సందేశాత్మకంగా సాగింది. అనంతరం వై.కె. నాగేశ్వరరావు ఆత్మీయ పురస్కారాన్ని పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు మేడికొండ శ్రీనివాసరావుకు అందించి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని కళా విపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, రామరాజు శ్రీనివాసరావు తదితరులు జ్యోతి ప్రకాశనంతో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా న్యాయమూర్తి శ్రీ రాంగోపాల్, గజల్ శ్రీనివాస్ , కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు డాక్టర్ కథక్ అంజిబాబు, డాక్టర్ ఎండీ.రఫీ, ఆలయ ఉపాధ్యక్షులు లంక విజయబాబు, లక్కరాజు సునీత పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డి.తిరుమలేశ్వరరావు, శంకర్, జి. మల్లికార్జునరావు పర్యవేక్షించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల ద్వారా వడదెబ్బ నుంచి ఉపశమనం

బ్రాహ్మణకోడూరు(చేబ్రోలు): ప్రస్తుత వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని దీని దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మన్నవ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్‌కే హుస్సేన్ తెలిపారు. పొన్నూరు మండలం బ్రాహ్మణకోడూరు గ్రామంలో గురువారం మన్నవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల్ని అవగాహన కల్పించారు. స్థానికులు ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద డాక్టర్ శివ గోపాల్, డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. వడదెబ్బ తగిలిన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్ల ద్వారా ఉపశమనం లభిస్తుందని తెలిపారు. చిటికెడు ఉప్పు, చారెడు పంచదార, నిమ్మరసం కలుపుకొని ఇంటిలోనే తయారు చేసుకోవచ్చునని వివరించారు.

వీవీఐటీలో 'అన్నీ మంచి శకునములే' చిత్ర బృందం సందడి



పెదకాకాని: సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా స్వప్న సినిమాస్ మిత్ర విందా మూవీస్ పతాకంపై బి.వి. నందినీరెడ్డి దర్శకత్వంలో 'అన్నీ మంచి శకునములే' చిత్రం రూపొందింది. ఈ చిత్రం మే 18న విడుదల కానున్న సందర్భంగా ప్రచారంలో భాగంగా యూనిట్ గురువారం నంబూరు వీవీఐటీ కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకురాలు నందినీరెడ్డి మాట్లాడుతూ ప్రేక్షకులకు ఆనందం అందించడానికే తాము చిత్రాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. 'అన్నీ మంచి శకునములే' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని, మంచి కుటుంబ కథా చిత్రంగా రూపొందించామని వివరించారు. రాబోవు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సంతోష్ శోభన్, మాళవికా నాయర్, వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. చిత్ర బృందంతో కలసి విద్యార్థులు నృత్యాలు, గీతాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

సాయిబాబా మందిరానికి వెండి సింహాసనం బహూకరణ



పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పట్టణ పరిధిలోని నిడుబ్రోలు షిర్డీ సాయిబాబా మందిరానికి దాతలు రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన వెండి సింహాసనాన్ని గురువారం అందజేశారు. పాలేటి శ్రీనివాస చౌదరి, తనూజ దంపతులు, వారి కుటుంబసభ్యులు సింహాసనాన్ని తయారు చేయించారు. సాయిబాబా మందిరం పూజారి కరణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దాతలు వారి కుటుంబ సభ్యులు, షిర్డి సాయిబాబా మందిర కమిటీ సభ్యులు, స్థానిక భక్త బృందం పాల్గొన్నారు.

కార్డియాక్ అరెస్టుపై అప్రమత్తత అవసరం

చేబ్రోలు: కార్డియాక్ అరెస్టుపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.రమేష్‌బాబు సూచించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ''హార్ట్ డిసీజెస్ : ఆరిజన్ అండ్ ప్రివెన్షన్'' అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ఆధునిక జీవితంలో మద్యం, ధూమపానం, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, వంశ పారంపర్యం, గ్యాస్ట్రిక్ సమస్యలు, ఒత్తిడి వంటి కారణాలతో ఎక్కువ మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారని వివరించారు. కార్డియాక్ అరెస్టు సంభవించినప్పుడు మెదడుకు రక్త ప్రసరణ ఎంతో ముఖ్యమని చెప్పారు. గోల్డెన్ సమయంలో చికిత్సను అందించడం ద్వారా వ్యక్తి ప్రాణాల్ని ఏ విధంగా కాపాడవచ్చో వివరించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.

మాదాల సుధాకర్ దంపతులకు స్వామి ఆశీర్వచనం



సుధాకర్ దంపతులను ఆశీర్వదిస్తున్న విజయేంద్ర సరస్వతి

పాత గుంటూరు: కంచి కామకోటి పీఠం కార్యక్రమాలకు నిరంతరం సహకారం అందిస్తున్న ఆధ్యాత్మిక చింతనాపరులు జనచైతన్య హౌసింగ్ లిమిటెడ్ చైర్మన్ మాదల సుధాకర్, మాదల సువర్ణలక్ష్మి దంపతుల్ని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీర్వదించారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం విచ్చేసిన స్వామి జనచైతన్య అధినేతల్ని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ మాదల శకుంతల, మాదల రత్నగిరిబాబు, మాదల సునీత, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలే సీఎం జగన్ ఆశయాలు



రక్తదానం చేస్తున్న వారితో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పట్నంబజారు: అభివృద్ధి చెందడమంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదని.. సామాన్య పౌరుల జీవన ప్రమాణాల మెరుగుదలే నిజమైన అభివృద్ధి అన్న భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలే ఆశయాలుగా చేసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పార్టీ ఎస్సీ విభాగం నేత పేటేటి నవీన్ ఆధ్వర్యంలో గురువారం బొంగరాలబీడులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగంలో ఏదైతే నిర్దేశించారో దాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తూ సీఎం జగన్ పరిపాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రతి అడుగులో అంబేడ్కర్ సూచించిన మార్గాన్ని అనుసరిస్తున్న ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, నవ్యాంధ్ర ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, పార్టీ నేతలు రెడ్డి కోటేశ్వరరావు, రబ్బాని, ఆలా కిరణ్, విద్యార్థి, ఎస్సీ విభాగం నేతలు విఠల్, రవి, ప్రశాంత్, హర్ష, బాలు, అజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు ప్రజల్లో విస్తృత ప్రచారం

బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ



జగన్నామ సంక్షేమ సంవత్సరం కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక సంస్కరణలు అద్వితీయమైన ఫలితాలు, అద్భుత విజయాలను నమోదు చేస్తున్నాయని బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గృహ సారథులు, వలంటీర్లు శుక్రవారం పట్టాభిపురంలోని బజరంగ్ ఫౌండేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. 'జగన్నామ సంక్షేమ సంవత్సరం – సేవా కార్యక్రమాల పరంపర వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బజరంగ్ సంస్థ క్షేత్రస్థాయిలో చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను, సంక్షేమ పాలనను ప్రజల్లోకి తనదైన శైలిలో తీసుకు వెళుతున్న బజరంగ్ ఫౌండేషన్ పనితీరును ప్రశంసించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారంజకంగా కొనసాగుతున్న సంక్షేమ పాలన తమకు ఎంతగానో స్ఫూర్తినిచ్చిందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంఘీభావంగా, మద్దతుగా తమ సంస్థ క్షేత్రస్థాయిలో పని చేస్తున్నదని తెలిపారు. ప్రజల గుండెల్లో సీఎం జగన్ పాలన సువర్ణ యుగం వలే ఉన్నదని కొనియాడారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని బజరంగ్ ఫౌండేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 35వ డివిజన్, 99వ వార్డు సచివాలయం జేసీఎస్ కన్వీనర్ ఏరువ ఇన్నారెడ్డి, గృహ సారథులు బి. కోటేశ్వరరావు, సచివాలయం కన్వీనర్ జి.ఎల్.వి.పద్మావతి, సోషల్ మీడియా కన్వీనర్ భూలక్ష్మి, వలంటీర్లు మేరీ, లలిత పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ దగ్గర ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ప్రారంభమైంది. క్రైం అడిషనల్ ఎస్పీ, ట్రాఫిక్ ఇన్‌చార్జి ఎ.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఈస్ట్ పరిధిలోని ఆటోడ్రైవర్లు, వాహనాల యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ విధిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని తెలిపారు. లైసెన్సు లేని వారికి ఆటో ఇస్తే యజమానులు కూడా బాధ్యులు అవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అధిక లోడుతో ప్రయాణిస్తే జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ నిసార్ బాషా, ఎస్ఐలు హరిబాబు, నారాయణ రెడ్డి, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అరుదైన వ్యాధి బారిన ఏడేళ్ల బాలుడు

నూతన చికిత్సా విధానంలో ప్రాణాలు రక్షించిన వైద్యుడు



బాలుడు సుశాంత్‌తో డాక్టర్ సుధీర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రాధిక తదితరులు

గుంటూరు మెడికల్: అత్యంత అరుదైన హెపటోరీనల్ సింప్రోమ్ విత్ హెపాటిక్ ఎన్‌సెఫ్‌లోపతి అనే వ్యాధి బారిన పడిన ఏడేళ్ల బాలుడికి ఆధునిక చికిత్సా విధానంతో వైద్యసేవలందించి ప్రాణాలు కాపాడినట్లు బ్లూజమ్స్ మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మేకల సుధీర్‌కుమార్‌రెడ్డి చెప్పారు. స్థానిక కొత్తపేటలోని హాస్పిటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామానికి చెందిన ఏ.రాజారావు కుమారుడు ఏడేళ్ల సుశాంత్ జ్వరం, వాంతులు, దగ్గు, మూత్రం పట్టివేయడం లాంటి సమస్యలతో కొద్దిరోజులుగా బాధపడుతున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు ఒంగోలులో పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా పరిస్థితిలో మార్పు రాకపోగా విషమించడంతో పది రోజుల కిందట తమ వద్దకు వచ్చారన్నారు. బాలుడికి వైద్య పరీక్షలు చేసి అరుదైన హెపటోరైనల్ సింప్రోమ్ విత్ హెపాటిక్ ఎన్‌సెఫ్‌లోపతి బారిన పడినట్లు గుర్తించామని చెప్పారు. తమ వద్దకు వచ్చే సమయానికి కామెర్లు విపరీతంగా పెరిగిపోయాయని, కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని, బ్రెయిన్‌కు ఇన్‌ఫెక్షన్ తీవ్రమై బాలుడు కోమాలో ఉన్నాడని తెలిపారు. అతడికి అత్యాధునిక ప్లాస్మా ఫెరోసిస్ థెరఫీ ద్వారా రక్తాన్ని శుద్ధిచేసి ప్లాస్మాను తీసి ఎక్కించామని వివరించారు. ఈ నూతన చికిత్సా విధానంతో బాలుడు త్వరితగతిన వ్యాధి నుంచి కోలుకున్నాడని, పది రోజులపాటు చికిత్స అందించడంతో కోమా నుంచి బయటపడి పూర్తి ఆరోగ్యానికి చేరుకున్నాడని పేర్కొన్నారు. గుంటూరులో మొట్టమొదటిసారిగా ప్లాస్మా ఫెరోసిస్ థెరఫీని తమ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. సకాలంలో చికిత్స చేయని పక్షంలో లివర్ మార్పిడి ఆపరేషన్ చేయాల్సి వచ్చేదని వెల్లడించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న తమ కుమారుడికి చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన వైద్యులకు బాలుడు సుశాంత్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఐసీయూ స్పెషలిస్టు డాక్టర్ రాధిక, నవజాత శిశువుల స్పెషలిస్టు డాక్టర్ హరీష్ పాల్గొన్నారు.